సాక్షి అనకాపల్లి

బుధవారం। 15। నవంబర్। 2023



ప్రజా క్షేమమే ధ్యేయంగా..

పీఎస్‌పేటలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ పల్లె నిద్ర చేశారు. ప్రజల కోసం పనిచేస్తున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 8లో



అత్యుత్తమ నాక్ ర్యాంకు

విశాఖ: ఏయూ నాక్ ఏ డబుల్ ప్లస్ గ్రేడ్ సాధించడంతో దూరవిద్య కేంద్రంలో మంగళవారం వేడుకలు నిర్వహించారు.

వాతావరణం

అనకాపల్లిటౌన్: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉష్ణోగ్రతలు 31.8 నుంచి 32.2 డిగ్రీల మధ్య నమోదవుతాయన్నారు.

న్యూస్‌రీల్

కార్తీక పూజలు ప్రారంభం



పంచదార్లలో ధర్మలింగేశ్వరస్వామికి పూజలు

రాంబిల్లి: జిల్లాలో ప్రసిద్ధి చెందిన పంచదార్ల పుణ్యక్షేత్రంలో మంగళవారం కార్తీక పూజలు ప్రారంభమయ్యాయి. తొలుత పవిత్రమైన ఆకాశధార వద్ద పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు క్షేత్ర పాలకుడు ఉమాధర్మలింగేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. నెల రోజులు కార్తీక దీక్షలు చేసే భక్తులు ఈ పుణ్యక్షేత్రానికి వచ్చి ఆకాశధార వద్ద పుణ్యస్నానం ఆచరించి దీక్షను స్వీకరించారు. దిమిలిలో చారిత్రక నగ్నేశ్వరస్వామి ఆలయంలోనూ కార్తీక మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. నెలరోజులు పాటు ఇక్కడ పూజలు నిర్వహిస్తారు. అలాగే కట్టుబోలు, మురకాడ, లాలంకోడూరు, వెల్చూరు తదితర గ్రామాల్లో శివాలయాల్లోనూ కార్తీక పూజలు ప్రారంభమయ్యాయి.

17న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

కశింకోట: అపరిష్కృత విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న ఉదయం 10 గంటలకు కశింకోట డివిజన్ ప్రధాన కార్యాలయం (ఆర్‌ఈసీఎస్ ప్రధాన కార్యాలయం)లో 'విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక' (సీజీఆర్‌ఎఫ్) నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ స్థానిక డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామకృష్ణ తెలిపారు. సీజీఆర్‌ఎఫ్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన కార్యక్రమం జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో తమ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవచ్చునని తెలిపారు.

రక్తహీనత నివారణపై ప్రత్యేక శ్రద్ధ

- వైద్య సిబ్బందికి కలెక్టర్ ఆదేశం



వెదురుపర్తిలో హైస్కూల్లో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కశింకోట: రక్తహీనతపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కలిగించాలని ఉపాధ్యాయులను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి కోరారు. మండలంలోని వెదురుపర్తి హైస్కూలును మంగళవారం మధ్యాహ్నం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రక్తహీనత నివారణకు ప్రభుత్వం అందిస్తున్న మాత్రలు విద్యార్థులకు అందుతున్నాయా.. లేదా? అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. రక్తహీనత నివారణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు తెలుగు, గణితంలో ప్రత్యేక బోధనకు నిర్వహిస్తున్న టీఏఆర్ఎల్ కార్యక్రమం అమలు తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమం పకడ్బందీగా అమలు కావడానికి ఉపాధ్యాయులు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి పిల్లలకు అందుతున్న సదుపాయాల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.వి.రవికుమార్, ఎంఈవో మూర్తి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రికి కుమార్తె అంత్యక్రియలు



తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్న ఇందు

కె.కోటపాడు: అనారోగ్యంతో మృతి చెందిన తండ్రికి కుమారులెవ్వరూ లేకపోవడంతో కుమార్తె అన్నీ తానై అంత్యక్రియలు నిర్వహించింది. రొంగలినాయుడుపాలెం గ్రామానికి చెందిన జామి దేముడుబాబు (54) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారులు లేకపోవడంతో తండ్రికి అంత్యక్రియలను జరిపేందుకు పెద్ద కుమార్తె ఇందు ముందుకు వచ్చింది. తండ్రి దేముడుబాబుకు అన్ని లాంఛనాలతో అంత్యక్రియలను పూర్తి చేసి తండ్రి రుణం తీర్చుకుంది.

అడుగడుగున గుడి ఉంది..

- గ్రామాల్లో చురుగ్గా దేవాలయాల నిర్మాణాలు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 804 మంజూరు
- రూ.80 కోట్ల 40 లక్షలు కేటాయించిన టీటీడీ
- గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక పరిమళాలు



గొలుగొండ మండలం చోద్యంలో ప్రతిష్ఠించిన కనకదుర్గ అమ్మవారు





నాతవరం మండలం వైబీ పట్నంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గణపతి దేవాలయం (ఇన్‌సెట్) నిర్మాణ దశలో ఉన్న రామాలయం

గొలుగొండ: గ్రామాల్లో ఆధ్యాత్మిక భావం పెంపొందేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం తలపెట్టిన కార్యక్రమం కార్యరూపం దాలుస్తోంది. దైవారాధనతో మనసు నిర్మలమై మనుషుల మధ్య సత్సంబంధాలు పెరుగుతాయని, చక్కని వాతావరణం ఏర్పడుతుందన్న సదాశయంతో టీటీడీ దేవాలయాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు విడతల్లో 804 దేవాలయాలు మంజూరు చేయడంతోపాటు రూ.80 కోట్ల 40 లక్షల నిధులు అందించింది. ప్రస్తుతం 40 దేవాలయాలు ప్రారంభం కాగా 180 ఆలయాలు శ్లాబ్ దశలో, మిగతావి పునాది దశలో చురుగ్గా పనులు జరుగుతున్నాయి. గ్రామాల్లో భక్తి భావం పెరగాలంటే ఆయా ప్రజల అభీష్టం మేరకు హిందూ దేవాలయాల నిర్మాణం జరగాలని టీటీడీ తలపెట్టింది. శ్రీవాణి ట్రస్టు ద్వారా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. దేవాలయాల నిర్మాణానికి రూ.10 లక్షలు వంతున మంజూరు చేస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో ఇంతవరకు 804 దేవాలయాల నిర్మాణానికి అనుమతి లభించగా.. అందులో 98 శాతం అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోనే ఉన్నాయి.

దేవాలయం మంజూరు కావాలంటే..

గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకారుల వీధుల్లో ఉన్న సభ్యులు కమిటీగా ఏర్పడాలి. ఈ కమిటీ ఆధ్వర్యంలో వీధుల్లో లేక గ్రామంలో ఏ దేవాలయం కావాలో చర్చించుకొని తీర్మానం చేసుకోవాలి. ఈ తీర్మానాన్ని స్థానిక ఎమ్మెల్యేకి ఇవ్వాలి. ఎమ్మెల్యే ద్వారా దేవదాయ శాఖ మంత్రికి ప్రతిపాదన వెళుతుంది. వీటిని పరిశీలించి తిరుమల తిరుపతి దేవస్థానం పరిధిలో ఉన్న శ్రీవాణి ట్రస్టు ద్వారా నిధుల మంజూరు జరుగుతుంది. గ్రామంలో రామాలయం, గణపతి, శివాలయం, అమ్మవారి దేవాలయాల మంజూరుకు కృషి జరుగుతోంది.

చురుగ్గా నిర్మాణాలు

ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో మంజూరైన దేవాలయాల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పనులను దేవదాయ శాఖ పరిధిలో ఉన్న ప్రత్యేక డీఈఈ ఎస్.కె.సైదా (విజయవాడ) పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే 40 దేవాలయాలు ప్రారంభమయ్యాయి. మరో 180 దేవాలయాలు శ్లాబ్ దశలో ఉన్నాయి. మిగిలినవి మార్కింగ్, పునాది స్థాయిలో ఉన్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని 804 దేవాలయాల్లో నర్సీపట్నం నియోజకవర్గానికే ఎక్కువగా మంజూరయ్యాయి. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శ్రద్ధ తీసుకొని 184 గుడులను మంజూరు చేయించారు.

సాత్వికత.. సమభావం



ఆలయాల నిర్మాణాల వలన భక్తిభావం పెరుగుతుంది. గుడి నిర్మించడానికి ప్రజలకు స్థోమత ఉండదు. టీటీడీ అందించిన ఆర్థిక సాయంతో ప్రతీ గ్రామంలో ఆలయాల నిర్మాణం జరుగుతోంది. ఆధ్యాత్మికత పెరిగితే ప్రజల్లో సాత్వికత, సమభావం ఏర్పడతాయి. మానవ సంబంధాలు మెరుగుపడతాయి.

– లెక్కల సత్యనారాయణ, జోగుంపేట

నిరంతర పర్యవేక్షణ

ఇప్పటి వరకు మంజూరైన ఆలయాల్లో చురుగ్గా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో ప్రతి రోజు పనులు పర్యవేక్షిస్తున్నాం. పనులు అయిన వెంటనే బిల్లుల చెల్లింపులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ ఏడాది చివరికి 60 శాతం ఆలయాలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్.కె.సైదా, డీఈఈ (విజయవాడ), ప్రత్యేక అధికారి

గవర్నర్‌కు ఆత్మీయ స్వాగతం



రైల్వే స్టేషన్ నుంచి బయటకు వస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్


ఏయూక్యాంపస్ : అరకు మండలంలో రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం రాత్రి నగరానికి చేరుకున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆత్మీయ స్వాగతం లభించింది. రైలులో విశాఖకు వచ్చిన గవర్నర్‌కు వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం సౌరబ్‌ప్రసాద్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోర్టు గెస్టు హౌస్ చేరుకున్న గవర్నర్‌ను విశాఖ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఉదయం 7 గంటలకు పోర్టు గెస్టు హౌస్ నుంచి రోడ్డుమార్గంలో అరకు మండలం పద్మపురం పంచాయతీ పరిధిలోని యండపల్లివలస రైల్వే గెస్టు హౌస్‌కు వెళ్తారు. ముందుగా నిర్ణయించిన కార్యక్రమాల్లో పాల్గొంటారు.

విస్తృత ఏర్పాట్లు

అరకులోయటౌన్: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం అరకులోయలో పర్యటించనున్నారు. ఈమేరకు స్థానిక క్రీడా పాఠశాల సమీపంలోని డిగ్రీ కళాశాల మైదానంలో విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ పర్యవేక్షించారు. సుమారు నాలుగు వేల మంది కూర్చోడానికి వీలుగా సభా ప్రాంగణం, వేదికను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించి, కాఫీ బోర్డు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, సచివాలయ భవనాలు, రోడ్లు తదితర అభివృద్ధి పనులకు సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేయనున్నారు. గవర్నర్ పర్యటనకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పీవో సూచించారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్



సభా ప్రాంగణం

రేపు జెడ్పీ వైస్ చైర్మన్ ఎన్నిక

మహారాణిపేట (విశాఖ): ఖాళీగా ఉన్న జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ఎన్నిక కోసం ఈ నెల 16న ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఉదయం పది గంటలకు జిల్లా పరిషత్ మందిరంలో సమావేశం జరుగుతుంది. సబ్బవరం జెడ్పీటీసీ సభ్యుడు, జెడ్పీ వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు సెప్టెంబర్ 10న అనారోగ్య కారణాలతో మృతి చెందిన సంగతి తెలిసిందే. దీంతో ఖాళీ అయిన ఆ పదవి కోసం ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని నోటిఫికేషన్ జారీ చేశారు. 16న ఎన్నిక జరగకపోతే 17న సెలవు అయినప్పటికీ తప్పకుండా ఎన్నిక నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. విశాఖ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున ఎన్నిక నిర్వహిస్తారు.

న్యాయ విజ్ఞానంతో చక్కని భవిష్యత్తు

- చోడవరం సీనియర్ సివిల్ జడ్జి అరుణశ్రీ



మాట్లాడుతున్న సబ్‌జడ్జి అరుణశ్రీ

చోడవరం రూరల్: బాలల హక్కులను పరిరక్షించడం కోర్టుల బాధ్యత అని చోడవరం సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ అన్నారు. మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక కాన్వెంట్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముందుగా చాచా నెహ్రూ చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించిన న్యాయమూర్తి అరుణశ్రీ విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాలల హక్కులను గురించి విద్యార్థి దశలో అవగాహన చేసుకోవాలని సూచించారు. విద్యార్థి దశలోనే న్యాయశాస్త్రం పట్ల అవగాహన ఏర్పడినట్లయితే భవిష్యత్‌ను చక్కగా తీర్చిదిద్దుకోవడానికి వీలు పడుతుందన్నారు. దివంగత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి అందించిన సేవలను తెలుసుకోవాలని, ఆయనకు బాలలంటే అమిత ఇష్టమని అందుకే ఆయన జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నామని చెప్పారు. కాన్వెంట్ కరస్పాండెంట్ బి.మురళి, ఏవో డి.శేఖర్, ప్రధానోపాధ్యాయుడు బి.రమేష్, డి.మోహన్‌రావులు పాల్గొన్నారు.

భార్య మృతి కేసులో భర్తకు పదేళ్ల జైలు

- మృతురాలి అత్తమామలకు ఏడేళ్ల జైలు
- అనకాపల్లి పదో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు తీర్పు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ - 1 శ్రీనివాసరావు

అల్లిపురం (విశాఖ): అదనపు కట్నం కోసం భార్యను వేధించి ఆమె మరణానికి కారణమైన ఘటనలో భర్తకు పదేళ్లు, అత్తమామలకు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ అనకాపల్లి పదో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎస్.శ్రీవిద్య మంగళవారం తీర్పు వెల్లడించారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శాంతిభద్రతల డీసీపీ – 1 కె.శ్రీనివాసరావు, పీపీ వడ్డాది వెంకటరావు వివరాలు వెల్లడించారు. 2017 జూన్ 19న బూరి నాగమణి పీఎం పాలెం, వాంబేకాలనీలోని ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుడు పెరుగు అప్పలస్వామి ఫిర్యాదు మేరకు పీఎం పాలెం పోలీసులు విచారణ చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. సాక్షులను విచారించి చార్జిషీట్ కోర్టులో ఫైల్ చేయగా మృతురాలి భర్త బూరి నాగరాజు, అత్తమామలు బూరి నర్సమ్మ, బూరి నారాయణరావుపై నేరం రుజువయ్యింది. దీంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు వెల్లడించారు. నిందితులకు శిక్ష పడేందుకు కృషి చేసిన విచారణ అధికారి ఏసీపీ (నార్త్ సబ్ డివిజన్) టీవీఎస్ నాగేశ్వరరావు, పీపీ వడ్డాది వెంకటరావును నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అభినందించినట్లు తెలిపారు.

అటవీ శాఖలో ఏసీబీ కలకలం

- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ డీఎఫ్‌వో రాజారావు
- ఎఫ్ఆర్‌వో, ఆఫీస్ రైటర్‌లతో సహా అరెస్టు
- జిల్లా స్థాయి అధికారి పట్టుబడడంతో సంచలనం

మధ్యాహ్నం 3 గంటలు.. జిల్లా అటవీ శాఖ అధికారి (డీఎఫ్‌వో) రాజారావు ఫీల్డ్ విజిట్‌కు వెళ్లి కార్యాలయానికి చేరుకున్నారు.. ఫైళ్లు చూసుకుంటున్న సమయంలో ఆఫీసు సిబ్బంది రూ.50 వేలు అందజేశారు. కరెన్సీ నోట్లను లెక్కబెడుతున్న సమయంలో అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు డీఎఫ్‌వోను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. క్షణాల్లో జరిగిన ఈ ఉదంతం ఉద్యోగ వర్గాల్లో సంచలనం కలిగించింది. జిల్లా స్థాయి అధికారి ఏసీబీ వలకు చిక్కుకోవడం చర్చనీయాంశమైంది.





ఏసీబీకి పట్టుబడిన నర్సీపట్నం డీఎఫ్‌వో రాజారావు, ఎఫ్ఆర్‌వో నారాయణమూర్తి





డీఎఫ్‌వో కార్యాలయం (ఇన్‌సెట్) కార్యాలయ ముఖద్వారం

నర్సీపట్నం: అటవీశాఖ అవకతవకలపై ఏసీబీ అధికారుల దాడి కలకలం సృష్టించింది. ఈ శాఖలో అవినీతిపై గతంలో ఆరోపణలు వచ్చినప్పటికీ, ఏసీబీ అధికారులు ఎప్పుడూ దాడులు జరిపిన సందర్భాలు లేవు. డీఎఫ్‌వో రాజారావు బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఆరోపణలు వెల్లువెత్తాయి. డీఎఫ్‌వో వ్యవహారశైలిపై కింది స్థాయి అధికారులు పత్రికలకు ఎక్కారు. వేధింపులకు పాల్పడుతున్న డీఎఫ్‌వోపై చర్యలు తీసుకోవాలంటూ సామిల్లుల యజమానులు ఆందోళన చేయడంతో పాటు సీసీఎఫ్‌కు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ శాఖాపరమైన చర్యలు తీసుకోలేదని అందరూ అనుకుంటున్న తరుణంలో నర్సీపట్నంలోని జిల్లా అటవీశాఖ అధికారి కార్యాలయంపై ఏసీబీ డీఎస్పీ శ్రావణి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన దాడులు సంచలనం సృష్టించాయి.

జరిగిందిదీ..

280 టేక్ చెట్ల కటింగ్‌కు అనుమతులు ఇచ్చేందుకు, వాటిని రవాణా చేసేందుకు డీఎఫ్‌వో రాజారావు రూ.60,500 డిమాండ్ చేయడంతో కలప వ్యాపారి బలిరెడ్డి ఈశ్వరరావు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు బాధితుడు ఈశ్వరరావును వెంటబెట్టుకుని ఉదయం 10 గంటలకే చింతపల్లి రోడ్డులో ఉన్న డీఎఫ్‌వో కార్యాలయం సమీపంలో మాటు వేశారు. డీఎఫ్‌వో ఫీల్డ్ విజిట్‌కు వెళ్లి మధ్యాహ్నం 3 గంటలకు కార్యాలయానికి వచ్చారు. ఈశ్వరరావు ఏసీబీ వారు అందించిన రూ.50 వేల నగదును.. డీఎఫ్‌వో అడిగారని ఎఫ్ఆర్‌వో నారాయణమూర్తి, ఆఫీస్ రైటర్ శ్రావణ్‌కుమార్‌లకు అందజేశాడు.

నారాయణమూర్తి, శ్రావణ్‌కుమార్ నగదును తీసుకువెళ్లి డీఎఫ్‌వోకు ఇచ్చారు. ఆయన నగదు సరిచూసుకుంటున్న సమయంలో అప్పటికే అక్కడ మాటు వేసి ఉన్న ఏసీబీ అధికారులు డీఎఫ్‌వోను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. డీఎఫ్‌వోకు నగదు ఇచ్చి కార్యాలయం నుంచి బయటకు వచ్చి పరుగులు పెడుతున్న ఎఫ్ఆర్‌వో నారాయణమూర్తిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు కార్యాలయంలోకి ప్రవేశించిన ఏసీబీ అధికారులు రాత్రి వరకు విచారణ చేశారు. డీఎఫ్‌వోతోపాటు మిగిలిన ఇద్దరిని అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరచనున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

శ్రీవారి వైభవ యాత్ర

- ఘన స్వాగతం పలికిన భక్తులు



యాత్ర రథానికి స్వాగతం పలుకుతున్న భక్తులు



స్వామివారి మూర్తికి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నక్కపల్లి: తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన వైభవ రథయాత్ర మంగళవారం ఉపమాక చేరుకుంది. ఈ యాత్ర రథానికి ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు, టీటీడీ సిబ్బంది వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఘన స్వాగతం పలికారు. ఈ రథంలో ఉన్న స్వామివారి మూర్తికి ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, అర్చక స్వాములు శేషాచార్యులు సాయి గోపాలాచార్యులు హారతులిచ్చారు. అనంతరం కోలాట బృందాలు, భజన బృందాల గోవింద నామ స్మరణతో ఆలయంలోకి స్వామివారి మూర్తిని తీసుకెళ్లారు. అక్కడ ధూప దీప నైవేద్యాలు, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. బేడా మండపం చుట్టూ స్వామివారి మూర్తిని ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రసాదాచార్యులు మాట్లాడుతూ ఈ ఏడాది సెప్టెంబరు 25న ఈ రథయాత్ర తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ప్రారంభమయిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న 250 స్వామివారి ఆలయాలను సందర్శించి మరలా తిరుపతి చేరుకుంటుందన్నారు. తిరుమల తిరుపతి వైభవాన్ని, స్వామివారి గొప్పతనాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ రాష్ట్రంలో వేంకటేశ్వరస్వామి ఆలయాలకు ఈ యాత్ర వెళుతోందన్నారు. ఈ యాత్రకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఘన స్వాగతం పలికారు. రథంలో ఉన్న స్వామి వారి మూర్తిని దర్శించి పులకించిపోయారు. వెంకన్న దర్శనం అపురూపం, అపూర్వం అని పరవశించిపోయారు. తిరుమల శ్రీవారి వైభవ రథయాత్ర జిల్లాలోని పలు ప్రాంతాల మీదుగా సాగుతోంది.

చట్టసభల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించాలి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రమణ

అనకాపల్లిటౌన్: బీసీలకు చట్టసభల్లో అధిక ప్రాధాన్యత కల్పించాలని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమసంఘ వ్యవస్థాపకుడు మొల్లి రమణబాబు రాజకీయ ర్టీలను డిమాండ్ చేశారు. స్థానిక ఓ ప్రైవేట్ హోటల్లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్కో పార్లమెంట్ పరిధిలో నాలుగు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే స్థానాలను బీసీలకు కేటాయించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ తమకు అధిక ప్రాధాన్యత ఇస్తుందో ఆ పార్టీకే బీసీల మద్దతు ఉంటుందన్నారు. సంఘం ఉత్తరాంధ్ర జిల్లా కార్యదర్శి పిల్లల శంకర్, ప్రధాన కార్యదర్శి కృష్ణంనాయుడు, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి జగ్గ అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షుడు అప్పారావు, మాజీ సర్పంచ్ రామనాయుడు పాల్గొన్నారు.

ప్రజాక్షేమమే ధ్యేయంగా సీఎం పాలన

- పీఎస్‌పేటలో పల్లె నిద్రలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం : ప్రజల కోసమే పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. పీఎస్‌పేట గ్రామంలో జనంతో మమేకమై ప్రజల సమస్యలు ఆయన తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా చోడవరం పంచాయతీ సచివాలయం -4 పరిధిలో పీఎస్‌పేట గ్రామంలో మంగవారం పల్లె నిద్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఈ గ్రామంలో పర్యటించారు. రామాలయం వీధి, బ్రాహ్మణవీధి, వెలమవీధి, కుమ్మరవీధి, బంగారమ్మపాలెం ప్రాంతాల్లో పర్యటించిన ఆయన స్థానికులతో కలిసి మాట్లాడారు. కొన్ని ఇళ్లకు వెళ్లి గ్రామ సమస్యలు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనితీరు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పనులపై వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలు స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే ధర్మశ్రీ సానుకూలంగా స్పందించారు. అంతకు ముందు పార్టీ జెండారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఒకరి ఇంట్లో భోజనం చేసి అక్కడే రాత్రి బసచేశారు. ఆయనతోపాటు మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, ఎంపీటీసీ పుత్రేవు శ్యామ్‌ప్రసాద్, యడ్ల లక్ష్మి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు బొగ్గు శ్యామల, పీఏసీఎస్ అధ్యక్షుడు దన్నిన వెంకట్రావు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు చవితిన బాబూరావు, దండుపాటి సన్యాశిరావు, వార్డుమెంబర్లు దండుపాటి శేఖర్, కోటేశ్వరరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



పీఎస్‌పేటలో పల్లె నిద్ర చేస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

కుల గణనకు సీఎం నిర్ణయం హర్షణీయం

బుచ్చెయ్యపేట : రాష్ట్రంలో కులాల వారీగా కుల గణన చేయాలన్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని అఖిల గాండ్ల తెలుకుల కార్పొరేషన్ రాష్ట డైరెక్టర్ చిత్రాడ జగదీష్ తెలిపారు. మంగళవారం వడ్డాదిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం తీసుకోని నిర్ణయాన్ని జగనన్న తీసుకుని కులాల వారీగా లెక్కించడం అభినందనీయమన్నారు. దీనివల్ల రాష్ట్రంలో ఏ కులానికి చెందిన వారు ఎంత మంది ఉన్నారు, వారి సంక్షేమానికి ఎంత నిధులు ఖర్చు చేయాలి...బడ్జెట్‌లో ఎంత నిధులు కేటాయించాలన్నది తెలుస్తుందన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి జరిగే కుల గణనను అధికారులు పారదర్శకంగా చేపట్టి ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా సర్వే చేయాలన్నారు. ఇప్పటి వరకు లెక్కల ప్రకారం రాష్ట్రంలో లక్షా 50 వేలు జనాభా మాత్రమే గాండ్ల తెలుకుల కులస్తులున్నట్లు చూపుతున్నారని, మా కుల పెద్దల లెక్కల ప్రకారం 15 లక్షలు వరకు జనాభా ఉన్నట్లు తెలుస్తుందన్నారు. కుల గణన చేసిన తరవాత జగనన్న చేదోడు పథకాన్ని తెలుకుల కులస్తులకు వర్తింపచేసి కుల వృత్తి చేసేవారికి నెలకు 300 యూనిట్లు వరకు సబ్సిడీ విద్యుత్ అందించాలని కోరారు. రాజమండ్రిలో జరిగే గాండ్ల తెలకుల దేవ తెలుకుల కార్తీక మాసం వన సమారాధనకు అధిక సంఖ్యలో తరలి రావాలని పిలుపు నిచ్చారు.

దుకాణంలో మంటలు

అనకాపల్లిటౌన్ : స్థానిక రింగ్‌రోడ్డు క్లిప్స్ ఫ్రైడ్ చికెన్ అండ్ బర్గర్ దుకాణంలో మంగళవారం గ్యాస్‌లీక్ అయ్యి అగ్ని ప్రమాదం జరిగినట్లు అగ్నిమాపక శాఖ అధికారి బి.నర్సింగరావు చెప్పారు. అగ్ని ప్రమాదంలో ఫ్రిజ్, ఫ్రీజర్, వాటర్ హీటర్స్, సీలింగ్ ఫ్యాన్లు, ఎలక్ట్రికల్ వైర్స్, కిచెన్ గదిలో వంట సామాగ్రి అగ్నికి ఆహుతైనట్లు ఆయన తెలిపారు. సుమారుగా రూ.3లక్షల ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నట్లు తెలిపారు. దుకాణ యజమాని బుద్ద గౌతమ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు.



దుకాణంలో మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వీరునాయుడు మాస్టారు సేవలు ఎనలేనివి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్
- ఆకట్టుకున్న కొత్త పరిమళం నాటిక



వీరునాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మునగపాక : నాటకరంగ అభివృద్ధికి దివంగత వీరునాయుడు అందించిన సేవలు మరువలేనివని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కొనియాడారు. మంగళవారం మునగపాకలోని నందీశ్వరా కళా ప్రాంగణం, తులసీ కళావేదికపై నాటకరంగ దర్శకుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు వెలగా వీరునాయుడు రెండో వర్థంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఎంతోమంది పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో వీరునాయుడు మాస్టారు ఎంతో కృషి చేశారన్నారు. మునగపాకలో కళాకారులను ప్రోత్సహించడంతో పాటు కళలపై మక్కువ పెంచేందుకు వీరునాయుడు ఎంతో కృషి చేశారన్నారు. వీరునాయుడు మాస్టారు కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని ఆకాంక్షించారు. ఎంపీటీసీ సూరిశెట్టి రాము అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, తదితరులు మాస్టారు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం నాగులాపల్లి ఎంపీపీ స్కూల్ ఉపాధ్యాయిని గూనూరు రాజ్యలక్ష్మిని సత్కరించారు.

అలరించిన కొత్త పరిమళం..

వీరునాయుడు మాస్టారు ద్వితీయ వర్థంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కొత్త పరిమళం నాటిక ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన తర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం కళాకారులు ప్రదర్శించిన నాటిక ఆహుతులను అలరించింది. ఈ నాటిక ప్రదర్శనకు కాండ్రేగుల శ్రీనివాసరావు రచన అందించగా బీఎంఎస్ పట్నాయక్ దర్శకత్వం వహించారు. ఈ నాటిక ప్రదర్శనను తిలకించేందుకు పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు కళాభిమానులు తరలివచ్చారు.

నేవీ పనులకు ఆటంకం కలిగించొద్దు

రాంబిల్లి: నేవీ ప్రహరీ పనులకు ఆటంకం కలిగించొద్దని తహసీల్దార్ పి.భాగ్యవతి, ఎస్ఐ దీనబంధు కోరారు. మంగళవారం వారు పెదకలవలాపల్లిలో పర్యటించారు. తమ జిరాయితీ భూముల్లో నేవీ ప్రహరీ పనులు చేస్తున్నారని,దీంతో తమకు ఇబ్బందులు కలుగుతాయంటూ పలువురు మహిళలు ఇక్కడ ధర్నా చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడల్లో జన్నవరం విద్యార్థుల ప్రతిభ

చోడవరం రూరల్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహిస్తున్న 67వ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో మండలంలోని జన్నవరం పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుతున్నారు. ఈ నెల 9,10,11 తేదీలలో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలో ఉమ్మడి విశాఖ జిల్లా జట్టులో ఆడుతున్న జన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని నిట్లా చంద్రకళ జట్టు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. వాలీబాల్‌తో పాటు బ్యాడ్మింటన్, త్రో బాల్ క్రీడలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు తరుణ్, రఘు, సుగంధి మేఘనలను మంగళవారం బాలల దినోత్సవం సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్.శ్రీనివాసరావులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని పద్మావతి, ఎస్.ప్రభాకర్, గ్రామ సర్పంచ్ కోసం సన్యాసిరావు, పాఠశాల చైర్మన్ ముచ్చకర్ల రమేష్ అభినందించారు. క్రీడలలో విద్యార్థులు మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వారంతా ఆకాంక్షించారు.



రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం


రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో బంగారు పతకం

యలమంచిలి : రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో యలమంచిలి పట్టణానికి చెందిన క్రీడాకారుడు ఎస్.మోహిత్ బంగారు పతకాన్ని సాధించినట్లు కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేది నుంచి 11వ తేదీ వరకు కడప జిల్లా రైల్వే కోడూరులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ఎస్.మోహిత్ అండర్ 48 కేజీల విభాగంలో ప్రతిభ కనబరిచి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నట్లు కోచ్ తెలిపారు. మోహిత్‌ను ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్తా, రాష్ట్ర తైక్వాండో అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అచ్యుత రెడ్డి, ఉపాధ్యక్షుడు అచ్చంనాయుడు అభినందించారు.



కోచ్ సత్యనారాయణతో తైక్వాండో క్రీడాకారుడు మోహిత్


వాలీబాల్ పోటీల్లో హరిపాలెం విద్యార్థి ప్రతిభ



వాలీబాల్ పోటీల్లో పతకం సాధించిన కుషన్ భాస్కర్‌తో హరిపాలెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని హరిపాలెం ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎ.కుషన్ భాస్కర్ వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఈ నెల 9 నుంచి 11 వరకూ మూడు రోజుల పాటు అరకులోయ జీటీడబ్ల్యూఏ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్టేట్ మీట్‌లో అండర్-14 విభాగంలో అంతర్ జిల్లాల 67వ స్కూల్ గేమ్స్‌లో ఉమ్మడి విశాఖ జిల్లా తరపున పాల్గొన్న కుషన్ భాస్కర్ మెరుగైన ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం ఎస్.రవి తెలిపారు. ఈ మేరకు పీఈటీ ధర్మిరెడ్డి రాజును అభినందించారు.


జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు తోటాడ విద్యార్థి



తోటాడ విద్యార్థి లాకేష్‌తో హెచ్‌ఎం కుమార్

మునగపాక : చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తోటాడ హైస్కూల్ హెచ్‌ఎం కుమార్ కోరారు. తోటాడ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న అంగులూరి లాకేష్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు అరకులోని జీటీడబ్ల్యూ ఆశ్రమంలో నిర్వహించిన అండర్-14 విభాగం అంతర్ జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చూపిన లాకేష్ డిసెంబర్ 26న ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడని హెచ్‌ఎం కుమార్ తెలిపారు. కాగా మంగళవారం లాకేష్‌ను ఆయన అభినందించారు. లాకేష్ జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంలో కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ పి.రవిశంకర్‌ను కూడా హెచ్‌ఎం అభినందించారు.


ఖోఖో పోటీల్లో విజేతకు అభినందన



క్రాంతికుమార్‌ను అభినందిస్తున్న దాడి జయవీర్

అనకాపల్లిటౌన్ : తుమ్మపాల గ్రామానికి చెందిన గుంట్ల క్రాంతికుమార్ ఇటీవల గోవాలో జరిగిన జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో కాంస్య పతకం దక్కించుకున్నాడు. ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టు తరపున పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించడం పట్ల కుమార్‌ను విశాఖజిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జయవీర్, జిల్లా కార్యదర్శి సీహెచ్.ఎల్.ఎం.శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు దాడి శ్యాంప్రసాద్ మంగళవారం అభినందించారు.

బాల్ బాడ్మింటన్‌లో మౌనిక ప్రతిభ



మౌనికను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సహదేవుడు, అధ్యాపకులు

రోలుగుంట : స్థానిక జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ ప్రథమ సంవత్సర విద్యార్థిని మరిశా మౌనిక జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. ఈ నెల 4 నుంచి 6 వ తేదీ వరకూ నెల్లూరు జిల్లా ఆత్మకూరులో జరిగిన అండర్-19 బాల్ బాడ్మింటన్ పోటీల్లో జిల్లా నుంచి పాల్గొని రాష్ట్రస్థాయిలో విజేతగా నిలిచి బహుమతి పొందింది. ఈమె ప్రతిభను గుర్తించి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. తమ కళాశాలకు గుర్తింపు తెచ్చిన మౌనికను మంగళవారం కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

క్లుప్తంగా

కార్తీక మాసోత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ



కార్తీక మాసోత్సవాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: గవరపాలెం కోటవీధిలో స్వయంభువుగా వెలసిన భోగలింగేశ్వర స్వామి కార్తీకమాసోత్సవాలు ఘనంగా నిర్వహించాలని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆలయ కమిటీ ప్రతినిధులను సూచించారు. కార్తీకమాసోత్సవాల గోడపత్రికను ఆయన తన గృహంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన శరన్నవరాత్రి వేడుకల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించిన కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు, ధర్మకర్తలు కొణతాల కృష్ణంరాజు, కాండ్రేగుల రాము, వాసుపల్లి తాతయ్యలు, కొణతాల త్రినాథ రావు, మెలిపాక ఈశ్వరావు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణపై ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ



స్థానిక డిపో మేనేజర్ సుజాతతో డ్రైవర్లు, ఆర్టీసీ సిబ్బంది

అనకాపల్లిటౌన్: స్థానిక ప్రజారవాణాశాఖ (ఆర్టీసీ) ఆధ్వర్యంలో అనకాపల్లి, నర్సీపట్నం డిపోలకు చెందిన 35 మంది డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను డిపో మేనేజర్ సుజాత వివరించారు. మంగళవారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో డ్రైవర్లందరినీ ఒక ప్రత్యేక బస్సులో తీసుకెళ్లి ఒక్కొక్కరితో డ్రైవింగ్ చేయించి, వారి పనితీరును పరిశీలించారు. పలు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో మెకానికల్ ఫోర్‌మెన్ అశ్విని, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా తంగేటి

అనకాపల్లి టౌన్: భారతీయ జనతా యువ మోర్చా(బీజేవైఎం) జిల్లా ప్రధాన కార్యదర్శిగా తంగేటి శివను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గేదెల స్వరూప్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ 9 ఏళ్లపాలనలో దేశం అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. తనపై నమ్మకంతో ఇచ్చిన ఈ బాధ్యతను శక్తివంచన లేకుండా నిర్వర్తించి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 2,406 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,690	4,280
రెండో రకం	3,550	4,030
మూడోరకం	3,200	3,540

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
జపాన్	: సత్యనారాయణస్క్రీన్-1
ద మార్వెల్స్(తెలుగు)	: సత్యనారాయణస్క్రీన్-2
జిగర్‌తండ	: షిర్డిసాయి
కీడా కోలా	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
టైగర్-3	: శ్రీసత్య
మా ఊరి పొలిమేర-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 13 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 437 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 357 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పాలన



కోట్నివీధిలో డిస్‌ప్లే బోర్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి



ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా గొలగాంలో పల్లె నిద్ర చేస్తున్న నేతలు



కోట్నివీధిలో ఇంటింటికీ వెళ్లి బ్రోచర్‌ను అందిస్తున్న మందపాటి జానకీరామరాజు

- వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు

అనకాపల్లిటౌన్: ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని మంగళవారం పట్టణ పరిధి సచివాలయం-8, కోట్నివీధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నాలుగున్నరేళ్లలోనే అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సచివాలయ పరిధిలో ఒక్కో వ్యక్తికి ఏ మేరకు ప్రభుత్వ లబ్ధి చేకూరిందో పేర్కొంటూ డిస్‌ప్లే బోర్డును ఏర్పాటు చేశారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరింత సంక్షేమం, అభివృద్ధి కోసం మళ్లీ సీఎంగా జగన్‌ను గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు మాట్లాడుతూ దశలవారీగా అనకాపల్లి పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్ మాట్లాడుతూ నీతినిజాయితీతో పాలన అందిస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి దీవించాలని కోరారు. సచివాలయ పరిధిలో అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలుచేసిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లాడుతూ 40 ఏళ్ల రాజకీయ జీవితంలో చంద్రబాబు అందించిన పాలన, నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనను బేరీజువేసుకోవాలని కోరారు. అవ్వాతాతలకు ప్రతి నెలా 1వ తేదీ తెల్లారకముందే వృద్ధాప్య పింఛన్లు ఇస్తున్న ప్రభుత్వం తమదేనన్నారు. అంతకుముందు కోట్నివీధి ప్రధాన కూడలి వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను దంతులూరి దిలీప్‌కుమార్ ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు 2014లో ఇచ్చిన హామీలు, 2019 జగన్ ఇచ్చిన హామీల బ్రోచర్లను ప్రజలకు అందించారు. అక్కడే రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పల్లెనిద్ర చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శి కోరుకొండ రాఘవ, పార్టీ నేతలు పలకా సత్యనారాయణ, కోట్ని రామచంద్రరావు, కె.మునిస్వామి, బుద్ధ భాస్కర్, సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కశింకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. స్థానిక సచివాలయం-2లో మంగళవారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయ పరిధిలో ఇప్పటి వరకు అమలు చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల వివరాలను తెలిపే బోర్డును ప్రదర్శించారు. దీన్ని ఎంపీపీ ఆవిష్కరించి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఏకైక సీఎం జగనేనని కొనియాడారు. సచివాలయం-2 పరిధిలో ప్రత్యక్ష, పరోక్ష పథకాల ద్వారా రూ.12.80 కోట్ల మేర లబ్ధి చేకూర్చినట్లు పేర్కొన్నారు. నాడు-నేడులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి, స్కూళ్ల అభివృద్ధికి రూ.కోటికి పైనే వెచ్చించామన్నారు. రూ.43.60 లక్షలతో సచివాలయ భవనం, రూ.60 లక్షలతో రోడ్లు, సుమారు రూ.45 లక్షలతో పలు అభివృద్ధి పనులు నిర్వహించినట్లు తెలిపారు. ఇంత గొప్పగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందివ్వడం గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. ఇంతగా ప్రజల కోసం పరితపించే వైఎస్ జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి పూర్తిస్థాయి సహకారం అందించాలని ప్రజలను కోరారు. ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. పుస్తకాన్ని ఆవిష్కరించి, ఆ పుస్తకంతోపాటు ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించేందుకు అవసరమయ్యే కిట్‌తో ఉన్న బ్యాగులను వలంటీర్లకు అందించారు.

ఇందిరా కాలనీలో ప్రచారం

ఇందిరా కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించి, అవి అందాయా? లేదో? లబ్ధిదారులను అడిగి ఎంపీపీ తెలుసుకున్నారు. వారంతా తమకు సంక్షేమ పథకాలు అందినట్లు తెలిపారు. మళ్లీ ఏపీకి జగనే ఎందుకు కావాలో వారికి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మలసాల కిషోర్, మండల పార్టీ సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజిమెన్, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు నమ్మి గణేష్, పంచాయతీ కార్యదర్శి ఎన్. రమేష్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

తుమ్మపాల: ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను నేరుగా అందిస్తూ గడిచిన నాలుగేళ్లలో ప్రజలకు అన్ని విధాలుగా ప్రభుత్వం తోడ్పాటు అందించిందని ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలోని గొలగాం గ్రామ సచివాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్'కార్యక్రమంలో ఆయనతో పాటు ఎంపీపీ గొర్లి సూరిబాబు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరాహ సత్యవతి, మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద హాజరై, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ లబ్ధిని తెలిపే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లకుండా సచివాలయాల ద్వారానే ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువచేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కిందన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు గ్రామంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల ఎవరెవరికి ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరించారు. రచ్చబండ నిర్వహించి ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ రథసారథి మళ్లీ జగనే ఎందుకు కావాలో.. గణాంకాలతో సహా వివరించారు. అంతకు ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. పల్లె నిద్ర చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.నాగనర్సింగరావు, వైస్ ఎంపీపీ విల్లూరి కుమారి చంద్రశేఖర్, ఎంపీడీవో నరసింగరావు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



వలంటీర్లకు జగనన్న కిట్ల పంపిణీ



ఇందిరాకాలనీలో ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దిలీప్‌కుమార్, సూరిబాబు, సత్యవతి తదితరులు

ఓం శివోహం రుద్ర నామం భజేహం



కాశీవిశ్వేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



గోకర్ణేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

- కార్తీక మాసం తొలిరోజు శివాలయాల వద్ద భక్తుల రద్దీ
- వైష్ణవాలయాలకూ పెరిగిన భక్తుల తాకిడి

అనకాపల్లిటౌన్: కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా పట్టణంలోని శివాలయాలు, వైష్ణవాలయాలు హరిహరుల నామస్మరణతో మారుమోగాయి. హర హర మహాదేవ శంభోశంకర, గోవిందా గోవింద అంటూ భక్తులు తమ ఇష్టదైవాలను స్మరించుకుంటూ ఆలయాల ముందు బారులుతీరారు. కార్తీకం తొలిరోజు కావడంతో మహిళలు భారీ ఎత్తున శివాలయాలకు క్యూ కట్టారు. స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు.

- స్థానిక వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజామున 3 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. మహిళా భక్తులు ఆలయ అర్చకులకు స్వయంపాకం, శాలిగ్రామ, దీపదానాలు చేశారు.
- కన్యకాపరమేశ్వరి ఆలయంలో అర్చకులు స్వామివారికి ఏకవార అభిషేకాలు నిర్వహించారు. గోకర్ణేశ్వరస్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.
- సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి.
- గవరపాలెం కోటవీధిలో భోగలింగేశ్వరస్వామి ఆలయానికి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ అర్చకులు పేరూరి భోగలింగం స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు.
- స్థానిక శారదానది ఘాట్ వద్ద ఉన్న ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో అభిషేకాలు, అర్చనలు జరిగాయి. అక్కడే ఉన్న స్నానఘాట్ వద్ద మహిళలు క్యూకట్టారు. ఆనవాయితీ మేరకు నదిలో స్నానమాచరించి స్వామివారిని దర్శించుకున్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి తోడ్పడాలి

అనకాపల్లి టౌన్: గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సబ్‌జైలు సూపరింటెండెంట్ వై.ఎస్.గణేష్‌రెడ్డి అన్నారు. స్థానిక శాఖవీధి గ్రంథాలయంలో మంగళవారం 56 జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ వారోత్సవాలు ఈనెల 20వ తేదీ వరకు జరుగుతాయన్నారు.



నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గణేష్‌రెడ్డి

స్టేట్ క్విజ్ పోటీల్లో ప్రతిభ

కశింకోట: స్థానిక డీపీఎస్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కోసం విద్యాశాఖ సహకారంతో వైద్య ఆరోగ్య శాఖ ఇటీవల విజయవాడలో పోటీలను నిర్వహించింది. జిల్లా తరపున పాల్గొన్న జట్టుకు ద్వితీయ స్థానం లభించింది. జట్టులోని డీపీఎస్ హైస్కూల్‌కి చెందిన కె.దిలీప్, జి.బాల గోపాల్ ప్రతిభ కనబరిచి రూ.8 వేల నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. వీరిని మంగళవారం స్కూల్లో జరిగిన బాలల దినోత్సవం కార్యక్రమంలో హెచ్‌ఎం ఏఆర్‌వీ అప్పారావు సత్కరించి అభినందించారు.

బాలల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి టౌన్: బాలల హక్కులను పరిరక్షించాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ఎంపీ బీవీ సత్యవతి అన్నారు. క్రియేటివ్ స్వచ్ఛంద సంస్థ, ఏపీ క్రాప్ చైల్డ్‌రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20 వరకు నిర్వహించే బాలల వారోత్సవాల గోడపత్రికను ఎంపీ తన కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వం అందిస్తున్న వివిధ కార్యక్రమాలను బాలలు సద్వినియోగం చేసుకుని, ఉన్నత విద్యనభ్యసించాలని అభిలషించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఎం.నాగేశ్వరరావు, ఎంపీ భర్త కె.విష్ణుమూర్తి పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి

'వై ఏపీ నీడ్స్ జగన్' నేడు

అనకాపల్లిటౌన్: పట్టణంలోని సచివాలయం -2 విజయరామరాజుపేట, మండలంలోని అక్కిరెడ్డిపాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సచివాలయాల పరిధిలో ప్రజలకు అందించిన ప్రయోజనాలను ప్రదర్శించడం, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి వారికి తమ ప్రభుత్వంలో కలిగిన లబ్ధిని వివరించి, వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ, పట్టణ, గ్రామ పెద్దలతో డిన్నర్, రాత్రి బస వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పారదర్శక ఓటరు జాబితాకు సహకరించండి

అనకాపల్లి రూరల్: తప్పుల్లేని, పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు అందరూ సహకరించాలని అనకాపల్లి నియోజకవర్గ ఎలక్ట్రోరల్ అధికారి, ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ రాజకీయపార్టీల నాయకులను కోరారు. మంగళవారం తన కార్యాలయంలో జరిగిన వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశంలో ఆయన మాట్లాడారు.

నేటి పిల్లలే భావి భారత నిర్మాతలు



నెహ్రూ విగ్రహానికి పూలమాల వేస్తున్న రత్నాకర్



నెహ్రూచౌక్‌లో.. కాంగ్రెస్ పార్టీ నేతలు



కశింకోటలోని సెయింట్ జాన్స్ స్కూల్లో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తూ..



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందిస్తున్న దంతులూరి దిలీప్‌కుమార్



సీతానగరం హైస్కూల్లో బహుమతులతో విద్యార్థులు

- ఊరూవాడా ఘనంగా బాలల దినోత్సవం
- దేశ తొలి ప్రధాని నెహ్రూకు ఘన నివాళి

'నేటి పిల్లలే రేపటి భారతదేశ రూపకర్తలు. వారిని మనం పెంచే విధానమే దేశ భవిష్యత్తును నిర్దేశిస్తుంది'అన్న చాచా నెహ్రూ మాటలు నిత్య స్మరణీయం. నెహ్రూ జయంతి సందర్భంగా ఊరూవాడా బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పిల్లల ఆటపాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

అనకాపల్లిటౌన్/అనకాపల్లి రూరల్: భారతదేశ తొలి ప్రధాని నెహ్రూ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. నెహ్రూ జయంతి వేడుకల్లో భాగంగా స్థానిక నెహ్రూచౌక్‌లోని నెహ్రూ విగ్రహం వద్ద, భీమునిగుమ్మం, సీతానగరం హైస్కూళ్లలో మంగళవారం నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ నెహ్రూ ప్రధాని అయ్యాక ప్రతి ఒక్కరూ విద్యనభ్యసించాలనే పాఠశాలల్లో మధ్యాహ్నభోజనం, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించారన్నారు. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కూడా అదే బాటలో పయనిస్తున్నట్లు కొనియాడారు. విద్యార్థులకు కంపాస్ బాక్సులు, బిస్కెట్ ప్యాకెట్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొణతాల భాస్కరరావు, సిలపరశెట్టి బాబ్జి, కోటిపల్లి జేజిబాబు, మొల్లి రమణబాబు, వామాల కాశి, పలకా కాసులు, కొత్తా గోపాలకృష్ణ, కటారి దేముడు, ఆళ్ల ప్రవీణ్, కోరిబిల్లి ఆరుద్ర, రేబాక ఇంద్రకుమార్, కొణతాల పరదేశినాయుడు, డీపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, సీతానగరంలో సర్పంచ్ సుంకర చంటి, బొడ్డపాటి చినరాజారావు, వెంకుపాలెంలో ఉప సర్పంచ్ దాడి గణేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

- మండలంలోని తుమ్మపాల జెడ్పీ హైస్కూల్లో ఏపీ ఇన్‌ల్యాండ్‌వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ పాల్గొని పిల్లలకు నోట్సు, స్టేషనరీ అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ చదువులో ప్రతిభ ఎంత ముఖ్యమో, క్రమశిక్షణ, దేశభక్తి కూడా అంతే ముఖ్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు, మండల అధ్యక్షుడు పెద్దిశెట్టి గోవింద్, వైస్ ఎంపీపీ విల్లూరి చంద్రశేఖర్ కుమారి, జాజుల రమేష్, ఎంపీటీసీ సభ్యులు పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి, వడ్డాది భారతీ అశోక్, దంతులూరి కల్యాణ్ చక్రవర్తి, పడాల గణపతి, వైస్ సర్పంచ్ చదరం చిన్న, ఎస్‌ఎంసీ చైర్మన్ గొంతిన శ్రీను పాల్గొన్నారు.
- స్థానిక ఉడ్‌పేట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాసరావు, కె.దేవినిరోషా నెహ్రూ జీవితంలో ముఖ్యమైన ఘట్టాలను వివరించారు. అంతకు ముందు జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. నెహ్రూ జయంతి వేడుకల్లో భాగంగా విద్యార్థినులు చేసిన నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులచే కూరగాయల మొక్కలు, జామ, మామిడి మొక్కలు నాటించి, వాటి సాగులో రైతులు ఎదుర్కొనే కష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఎ.వరలక్ష్మి, ఎల్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఇ.కిశోర్‌బాబు, డి.నాగలక్ష్మి, బి.ధనలక్ష్మి పాల్గొన్నారు.

డైట్ కళాశాలలో..

పట్టణంలోని డైట్ కళాశాలలో నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత తొలి ప్రధానిగా నెహ్రూ అందించిన సేవల్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తుమ్మపాల: స్థానిక నెహ్రూచౌక్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూ జయంతి వేడుకలు జరిగాయి. పార్టీ పార్లమెంట్ పరిశోధన సమన్వయకర్త బోయిన భానుమూర్తియాదవ్ నెహ్రూ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ఆర్ నాయుడు, అసెంబ్లీ కో ఆర్డినేషన్ కమిటీ సభ్యుడు కాళ్ల సత్యనారాయణ, సత్యనారాయణస్వామి ఆలయ మాజీ చైర్మన్ సేనాపతి ఈశ్వరరావు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కశింకోట: మండలంలోని రెండు గ్రంథాలయాల్లో గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దేశ తొలి ప్రధాని నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, డీపీఎస్ హైస్కూల్ హెచ్‌ఎం ఎంఆర్‌వీ అప్పారావు, శిష్టి అప్పారావు,యల్లపు రామచంద్రరావు, పెంటకోట శ్రీనివాసరావు, గ్రంథాలయ అధికారి కె.వరలక్ష్మి పాల్గొన్నారు.

- మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాలతో విజ్ఞానం అలవడుతుందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని కోరారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు లగిశెట్టి గణేష్, చిన్ని వల్లభనారాయణ రావు, స్థానిక పెద్దలు చిన్ని భాస్కర్, దేముడుబాబు, గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.
- క్రమ శిక్షణ, సత్ప్రవర్తనతో విద్యార్థులు మెలగాలని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్, లెఫ్టినెంట్ కల్నల్ డీటీ ఆంథోని కోరారు. స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్లో నిర్వహించిన బాలల దినోత్సవంలో పాల్గొని నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. స్కూలు డైరెక్టర్ బత్తుల నోబుల్ కుమార్, కరెస్పాండెంట్ బత్తుల అనూరాధ పాల్గొన్నారు.